క్లుప్తంగా

వైభవంగా వేణుగోపాల స్వామి గ్రామోత్సవం

కంభం: మండలంలోని రావిపాడులో రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారిని ఊరేగించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు అన్నా కృష్ణచైతన్య తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


స్వామివారిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

పడరాని పాట్లు.. సర్కస్ ఫీట్లు..

- మార్కాపురానికి స్వాగతం పలుకుతున్న గుంతలు
- చెరువుకట్ట రోడ్డుపై వాహనదారులకు నరకం
- మట్టిపోసి మమ అనిపించిన అధికారులు
- తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా స్పందన శూన్యం

మార్కాపురం: మసి పూసి మారేడు కాయ చేయడం అనే సామెత వినే ఉంటారు. దీనిని మార్కాపురం లోని ప్రజాప్రతినిధులు, అధికారులు నిజం చేశారు. డివిజన్ కేంద్రమైన మార్కాపురానికి చేరుకునే చెరువుకట్ట రోడ్డుపై ప్రయాణికులు, వాహనదారులు నిత్య నరకం అనుభవిస్తున్నా పాలకులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తూ చోద్యం చూస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా మార్కాపురంలో ఏర్పాటు చేసిన సభకు సీఎం చంద్రబాబు హాజరైన విషయం తెలిసిందే. సీఎం పర్యటన నేపథ్యంలో పట్టణంలోకి ప్రవేశించే ప్రధాన మార్గాలకు తాత్కాలికంగా మెరుగులు దిద్దారు. ఒంగోలు వైపు నుంచి మార్కాపురం పట్టణంలోకి ప్రవేశించే చెరువుకట్ట రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులను పూడ్చేందుకు గ్రావెల్ తోలారు. పర్యటన ప్లాన్ మారడంతో ఆనాడు వదిలేసిన మట్టితో వారం క్రితం గుంతలు పూడ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోవడంతో యథావిధిగా గుంతలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా రేడియో స్టేషన్ సమీపం నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ ఆఫీస్ వరకు సుమారు 100 మీటర్ల మేర రోడ్డు దారుణంగా తయారైంది. అక్కడి నుంచి అలుగు వరకు ప్రయాణం ఊయల.. జంపాలలాగా మారింది. ద్విచక్ర వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సిన దుస్థితి. గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా అధికారుల్లో చలనం లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్లపై ఒక్క గుంత కూడా కనిపించదని డాంబికాలు పోయిన కూటమి నాయకులు ప్రస్తుతం కిమ్మనడం లేదు. కానీ రహదారుల మరమ్మతులకు కోట్ల రూపాయలు ఖర్చు చేశామని వేదికలెక్కి బాకాలు ఊదుతున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్లను బాగు చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.


జీప్ స్టాండ్ వద్ద గుంతలు పడిన రోడ్డు


ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద ఇలా..


రోడ్డుపై గుంతలో తాత్కాలికంగా పోసిన మట్టి


చెరువుకట్ట వద్ద ఒంగోలు రోడ్డు పరిస్థితి

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

గిద్దలూరు రూరల్: విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బి.రామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, యువ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో కోతకు గురైన రోడ్లు


గనివానిపాడు-వాగుమడుగు మార్గంలో కోతకు గురైన రోడ్డు

కొనకనమిట్ల: ఉపరితల ద్రోణి ప్రభావంతో బుధవారం రాత్రి గనివానిపాడు, వాగుమడుగు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. గనివానిపాడు నుంచి కలవలపల్లి వెళ్లే రోడ్డు, అలాగే వాగుమడుగు నుంచి గనివానిపాడు వెళ్లే రహదారి కోతకు గురయ్యాయి. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కేసరీ నందన.. మహాజగ వందన

హనుమాన్ జయంతి పర్వదినాన్ని మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్లను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, ఆకుపూజ చేశారు.


గిద్దలూరులో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న హిందువులు


గొట్లగట్టులో పూజల్లో పాల్గొన్న భక్తులు

మార్కాపురం/మార్కాపురం టౌన్:

మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న నాగులపుట్ట వీరాంజనేయ స్వామి చందన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. మండలంలోని వేములకోట, బొడిచర్ల, ఎల్‌బీఎస్ నగర్, చింతగుంట్ల తదితర గ్రామాల్లో హనుమత్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో విష్ణు సహస్ర నామం హనుమాన్ చాలీసా, హనుమాన్ దండకాన్ని పారాయణం చేశారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

కొనకనమిట్ల: మండల కేంద్రమైన కొనకనమిట్ల, గొట్లగట్టు, నాయుడుపేట, పెదారికట్ల తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గొట్లగట్టులో సువర్చలా సమేత అభయాంజనేయస్వామికి అభిషేకాలు, హోమం చేశారు. తొలుత గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రం, రేగడపల్లి పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు విశేష పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

తర్లుపాడు: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి సన్నిధిలో ఉన్న వీరాంజనేయస్వామి ఉపాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం చేసి, స్వామివారికి నూతన వస్త్రాలు సమర్పించారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త విజయభాస్కర్‌రావు, ఈఓ చెన్నకేశవరెడ్డి, సత్యసాయి భజన మండలి కన్వీనర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: స్థానిక రేడియాబావి సమీపంలో గల అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి గ్రామోత్సవం వైభవంగా సాగింది. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హైవే రోడ్డు నుంచి వైఎస్సార్ సెంటర్, కుమ్మరాంకట్ట సెంటర్, గాంధీబొమ్మ సెంటర్, పొట్టిశ్రీరాములు సెంటర్ మీదుగా అభయాంజనేయస్వామి ఆలయం వరకు బైక్‌లతో హనుమాన్ శోబాయాత్ర వైభవంగా నిర్వహించారు. రాచర్ల గేటు, కొత్తపల్లె, పాదలకుంటపల్లె, కె.ఎస్.పల్లె తదితర గ్రామాల్లో హనుమంతుడికి విశేష పూజలు చేశారు.

అర్ధవీడు: మండలంలోని అంకభూపాలెంలో హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్న సంతర్పణ కార్యక్రమాన్ని కొత్త చిన్న బాపనయ్య నిర్వహించారు. అర్ధవీడు, మోహిద్దీనుపురం, నాగులవరంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యరమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని విజయాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం తెల్లవారుజాము నుంచి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్రపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది.

బేస్తవారిపేట: మంలంలోని సలకలవీడు, పూసలపాడు, బేస్తవారిపేట, పిటికాయగుళ్ల, పూసలపాడు గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతం, అభిషేకాలు, ఆకుపూజ, సహస్త్రనామ పూజలు, సుందరకాండ, హనుమాన్ చాలిసా పారాయణం చేశారు. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ కమిటీలు, దాతల సహకారంతో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

కంభం: స్థానిక ఆంజనేయస్వామి ఆలయం, వాసవీ స్కూల్ వెనుక అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. పట్టణంలో హనుమాన్ గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

రాచర్ల: మండలంలోని అనుమలవీడులో ఆంజనేయస్వామి ఆలయంలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్‌రెడ్డి, ఆయన కుమారుడు వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతోపాటు అన్న సంతర్పణ చేశారు.


కొనకనమిట్లలో పంచముఖ అభయాంనేయస్వామి


బేస్తవారిపేటలో వీరాంజనేయస్వామి


బొడిచర్లలో ప్రత్యేక అలంకరణలో హనుమాన్


తర్లుపాడులో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు


కొమరోలులో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు


అనుమలవీడులో అన్న సంతర్పణ చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి


కంభం అభయాంజనేయస్వామి ఆలయం వద్ద కోలాటం

ఆర్టీసీ కార్గో సర్వీసులు ప్రారంభం


ఆర్టీసీ కార్గో సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీఎం నరసింహులు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఏపీ ఎస్ఆర్టీసీ కార్గో పార్శిల్ సర్వీసులను మార్కాపురం ఆర్టీసీ డీఎం నరసింహులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ద్వారా ప్రజలకు మెరుగైన కార్గో సేవలు అందించే ఉద్దేశంతో సబ్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడి నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు పార్శిల్స్ పంపుకోవచ్చని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఐ రమేష్‌బాబు, బుకింగ్ ఆఫీసర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చదరంగంతో మేధాశక్తి పెంపుదల


చెస్ ఆడుతున్న విద్యార్థులు

మార్కాపురం టౌన్: చదరంగంతో మేధాశక్తిని పెంపొందించుకోవచ్చని మార్కాపురం గ్రంథాలయ అధికారి శివారెడ్డి పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా గురువారం చిన్నారులకు చెస్‌లో మెళకువలు తెలియజేశారు. వేసవి శిక్షణా తరగతులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు తీసుకొచ్చి పుస్తక పఠనం, గ్రంథాలయ విశిష్ఠతను వివరించారు.

5న ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర మహాసభ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘు నాయకులు

మార్కాపురం టౌన్: విజయవాడలో జూన్ 5వ తేదీన నిర్వహించనున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మూడో రాష్ట్ర కౌన్సిల్ మహాసభను విజయవంతం చేయాలని సంఘ నాయకులు కోరారు. గురువారం మార్కాపురంలోని ఎన్‌జీఓ కార్యాలయంలో చలో విజయవాడ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాలూకా అధ్యక్ష కార్యదర్శులు కె.చెంచిరెడ్డి, బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కౌన్సిల్ మహాసభకు ఉద్యోగులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బడేసాహెబ్, కోమలి, ఖాన్, శేఖర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్డెన్ సెర్చ్‌లో 45 బైకులు సీజ్

దర్శి (కురిచేడు): దర్శి మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్‌లో పోలీసులు గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కార్డెన్ సెర్చ్‌లో ఎటువంటి పత్రాలు లేని 45 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలు సీజ్ చేసినట్లు సీఐ రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జై భజరంగబలి..


మార్కాపురంలో శోభాయాత్ర అగ్రభాగాన 20 అడుగుల హనుమాన్ విగ్రహం

మార్కాపురం:

మార్కాపురం పట్టణంలో గురువారం సాయంత్రం హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. స్థానిక తర్లుపాడు రోడ్డులోని ఆంజనేయస్వామి విగ్రహం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర కోర్టు సెంటర్, కంభం సెంటర్, పాత బస్టాండ్, దోర్నాల బస్టాండ్, నాయుడు వీధి, తేరు బజారు, మెయిన్ బజారు మీదుగా చెన్నకేశవ స్వామి గుడి ప్రాంగణానికి చేరింది. విశ్వహిందూ పరిషత్, హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో సుమారు 20 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కోలాటం, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. శోభాయాత్రలో అగ్రభాగాన సబ్‌కలెక్టర్ త్రివినాగ్, ప్రముఖ అధ్యాత్మికవేత్త గోపాలుని హరిహరరావు, కమిటీ కన్వీనర్లు గుంటక సుబ్బారెడ్డి, ఇమ్మడిశెట్టి వీరారావు, గుంటక వనజాక్షి, పీవీ కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, పైడిమర్రి రామచంద్ర, శిరసనగండ్ల శ్రీనివాసులు, ఐ.రంగస్వామిగౌడ్, రమణ, శాసనాల సరోజినీ, శ్రీధర సాయిసుబ్బారావు తదితరులు హనుమాన్ జెండాలు చేతపట్టుకుని జై శ్రీరామ్.. జై హనుమాన్ నినాదాలు చేశారు. వేలాది మంది భక్తుల జయజయ ధ్వానాల మధ్య శోభాయాత్ర ముందుకు సాగింది. కోఆప్షన్ సభ్యురాలు, కోలాటం బృంద ట్రైనర్ గుంటక వనజాక్షి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోలాటం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మార్కాపురం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పట్టణ, రూరల్, ట్రాఫిక్ ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, అంకమరావు, అహరోన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


శోభాయాత్రలో పాల్గొన్న సబ్ కలెక్టర్ త్రివినాగ్


మార్కాపురంలో మహిళల కోలాటం ప్రదర్శన

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com